క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు 43వ డివిజన్ పెద్ద బజారులో స్టా బీడీ సంస్థ అధినేత మగ్దూం హుస్సేన్ పెద్ద కుమారుడు మహమూద్ హుస్సేన్ వురఫ్ చౌదరి సాహెబ్ మృతిచెందారు. శనివారం వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నేత్రదానం



సాయికృష్ణ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): విడవలూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన సాయికృష్ణ (27) శుక్రవారం రాత్రి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతని నేత్రాలను కుటుంబ సభ్యులు శ్రీనివాసులు, పవన్‌తేజ నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. మృతుడి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలిచిన వారు 99595 89321 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చర్యలు తీసుకోవాలంటూ..



స్కూల్ ఎదుట ధర్నా

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా యూనిఫాం, పుస్తకాలు విక్రయిస్తున్న శ్రీచైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారూఖ్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని పలు శ్రీచైతన్య స్కూల్స్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనిఫాం నుంచి బూట్ల వరకు అధిక రేట్లకు విద్యార్థులకు బలవంతంగా అంటగడుతూ రూ.కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడికి సత్కారం



నెల్లూరు(అర్బన్): నగరంలోని మూలపేటలో ఉన్న ప్రభుత్వ జిల్లా ఆయుర్వేద వైద్యశాలలో పనిచేస్తూ బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళుతున్న ఆయుర్వేద వైద్యుడు గోవిందయ్యను అక్కడి ఉద్యోగులు తదితరులు శనివారం ఘనంగా సన్మానించారు. పలువురు డాక్టర్లు, సిబ్బంది మాట్లాడుతూ గోవిందయ్య ఇక్కడ బాధ్యతలు చేపట్టిన నాలుగేళ్లలో ఆయుర్వేదానికి విస్తృత ప్రచారం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు యోగా గురువులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



ఫెస్టివల్ కమిటీ సభ్యులతో మంత్రి

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీమద్ ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి దేవస్థానంలో ఈనెల 25వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. మూడేళ్లకొక పర్యాయం జరిగే ఈ బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించి శనివారం రాత్రి 18 మంది సభ్యులతో ఫెస్టివల్ కమిటీ ఏర్పాటుచేసి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 21 రోజుల నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన జూలై 5వ తేదీన జరిగే తపస్సుమాను ఉత్సవం, 13వ తేదీన జరిగే అగ్నిగుండ ప్రవేశఘట్టాన్ని కనులపండువగా నిర్వహించనున్నామన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, ఇంకా తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం శ్రీస్వామి అయ్యప్ప దేవస్థానంలో కొలువైయున్న శ్రీమహాలక్ష్మీ గోదా సమేత శ్రీగురువాయూర్ మహావిష్ణు స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగురువాయూర్ మహావిష్ణు స్వామికి తిరు కల్యాణమహోత్సవం కనులపండువగా జరిగింది. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం స్థానాచార్యులు ఉభయ వేదాంత శ్రీమాన్ కొమాండూరు ఇళైయవిల్లి స్థలశాయి స్వామి ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణోత్సవాన్ని సంప్రదాయంగా, శాస్త్రోక్తంగా చేపట్టారు. తొలుత మహాకుంభారాధన, నిత్యహోమం, నివేదన, శాత్తుమొరై భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువైన స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అన్నప్రసాద వితరణ జరిగింది. ఉభయకర్తలుగా గంటా రమణయ్య నాయుడు, ప్రమీల దంపతులు, భక్తబృందం వ్యవహరించింది. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య సభ్యులు పర్యవేక్షించారు.

కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అధికారులు

నెల్లూరు రూరల్: కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో ఉదయభాస్కర్, ఏఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

- నెల్లూరు(అర్బన్): సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయం ఆవరణలో శనివారం డాక్టర్లు, సిబ్బంది కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అంతకుముందు యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ రమేష్, జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.
- నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్, డీసీఓ కార్యాలయాల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ భవన్‌లో ఎస్ఈ విజయన్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు శ్రీధర్, శేషాద్రిబాలచంద్ర, సోమశేఖర్ రెడ్డి, డీఈఈలు అల్తాఫ్, శేఖర్ ఏఈలు పాల్గొన్నారు. డీసీఓ కార్యాలయంలో డీసీఓ గుర్రప్ప, రామ్మూర్తి నగర్‌లోని కార్యాలయంలో డీసీఏఓ తిరుపాల్‌రెడ్డి మొక్కలు నాటారు.



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం పోలీస్ కార్యాలయంతోపాటు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం భావితరాలకు అందించేందుకు మొక్కలను విరివిగా నాటాలన్నారు. అనంతరం ఎస్పీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, పి.సింధుప్రియ, వెంకటరమణ, ఏఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బొలెరో



ఘటనా స్థలంలో క్షతగాత్రురాలు రమాదేవి

- మహిళకు తీవ్ర గాయాలు

కొడవలూరు: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలోని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నాయుడుపాళెం వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ఎన్వీ ప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు.. కావలికి చెందిన పులి మహేంద్రరెడ్డి భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలతో కలిసి బొలెరో వాహనంలో సొంత పనిపై నెల్లూరు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి అదే వాహనంలో కావలికి వెళుతున్నారు. ఈ క్రమంలో నాయుడుపాళెం వద్ద అదుపుతప్పి ముందు వెళుతున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బొలెరోలో ఉన్న రమాదేవికి తీవ్ర గాయాలయ్యాయి. మహేంద్రరెడ్డి, ఇద్దరు పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రురాలిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దెబ్బతిన్న బొలెరో వాహనం

ఉత్తమ నవలగా 'కిలారి'

నెల్లూరు(బృందావనం): జొన్నలగడ్డ రాంభొట్లు - సరోజనమ్మ స్మారక 2024 'సిరికోన సాహితీ అకాడమీ' ఆధ్వర్యంలో నిర్వహించిన నవలా రచన పోటీల ఫలితాలను ఆ సంస్థ నిర్వాహకుడు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం శనివారం ప్రకటించారు. ఉత్తమ నవలగా సమగ్ర గ్రామీణ జీవితాన్ని ఆవిష్కరిస్తూ డాక్టర్ బి.నాగేషు రచించిన నవల 'కిలారి', ప్రత్యేక బహుమతులకు మూడుతరాల నారీ చేతనకు అద్దంపడుతూ రెంటాల కల్పన రచించిన 'కావేరికి అటూ ఇటూ' మరొక ప్రత్యేక బహుమతికి నల్లమల అడవుల్లోని చెంచుల జీవితాన్ని అత్యంత సన్నిహితంగా పరిచయం చేస్తూ రంజిత్‌గన్నోజు రచించిన 'లింగాల కంతంలో'ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. ఆయా నవలలకు ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందజేయనున్నట్లు వివరించారు. నాలుగేళ్లగా అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న నవలా పోటీలకు రచయితలు స్పందిస్తున్న తీరు అభినందనీయమన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): భార్య, ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన భర్త, మరికొందరిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన ఆబిదాకు, కనుమూరుకు చెందిన రియాజ్‌తో 2015లో వివాహమైంది. ఆ సమయంలో ఆమె కుటుంబ సభ్యులు రియాజ్‌కు ఘనంగా కట్నకానుకులిచ్చారు. కొంతకాలం తర్వాత భర్త, అత్తింటివారు ఆమెను అదనపు కట్నం కోసం వేధించసాగారు. పెద్దమనుషుల సూచనల మేరకు దంపతులు బుజబుజనెల్లూరులో వేరుగా కాపురం పెట్టారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో ఆబిదా ఈ ఏడాది జనవరిలో పుట్టింటికి వెళ్లింది. బ్యాంక్‌లో గోల్డ్‌లోన్ రెన్యువల్ చేయించాలని రియాజ్ కోరడంతో ఆమె ఈనెల 20వ తేదీన తన తల్లి, అన్నతో కలిసి బుజబుజనెల్లూరుకు వచ్చింది. అక్కడ దంపతుల నడుమ మాటామాటా పెరిగింది. రియాజ్ భార్యపై చేయి చేసుకున్నాడు. అడ్డు వెళ్లిన ఆమె తల్లి, అన్నపై రియాజ్ సోదరుడు దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు శనివారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగా గురువులకు అభినందన

నెల్లూరు(బారకాసు): ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో యోగాంధ్ర నిర్వాహకులు, యోగా గురువులు, కార్పొరేషన్ వివిధ విభాగాల అధికారులు, వివిధ యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని కమిషనర్ నందన్ అభినందించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

పది మద్యం బాటిళ్ల స్వాధీనం

కావలి(జలదంకి): కావలిలోని మానికలవారి వీధికి చెందిన డి.వంశీకృష్ణారెడ్డి ఇంట్లో 750 మి.లీ. పరిమాణం కలిగిన పది ఫుల్‌బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. తమిళనాడుకు చెందిన మిలటరీ మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలోని అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కామేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు పీజీటీ-1, ఇంగ్లిష్ పీజీటీ-1, టీజీటీ-1, గణితం పీజీటీ-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పీజీటీ పోస్టులకు 50 శాతం మార్కులు తగ్గకుండా బీఈడీ పూర్తి చేసిన, టీజీటీ పోస్టుకు బీఈడీ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణత సాధించిన మహిళలు అర్హులని తెలిపారు. డిప్యూటీ డీఈఓ ఆధ్వర్యంలో అభ్యర్థుల బోధనాపటిమను పరిశీలించి ఎంపిక చేస్తామని చెప్పారు. అర్హులైన వారు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఈనెల 25వ తేదీలోగా గురుకులంలో సంప్రదించాలని కోరారు.

రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో పేద ప్రజలకు ఇచ్చిన డీఫాం పట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే మున్నా డిమాండ్ చేశారు. నగరంలోని సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలాజీ నగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో పేద ప్రజలకు ఇచ్చిన డీఫాం పట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సర్దార్, వాసుదేవరెడ్డి, అహ్మద్, మీరా, కరిముల్లా, షాన్‌వాజ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

జయభారత్‌కు అంబులెన్స్ వితరణ



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నెల్లూరు(అర్బన్): నగరంలో సింహపురి వైద్యసేవా సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న జయభారత్ ఆస్పత్రికి భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ వారు రూ.7 లక్షలతో అంబులెన్స్‌ను శనివారం ఆస్పత్రిలో వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ ట్రస్ట్ అధ్యక్షుడు జైన్ మాట్లాడుతూ వెంటిలేటర్ సౌకర్యంతో కూడిన అంబులెన్స్‌ను అందించామన్నారు. తాము ఇదే ఆస్పత్రిలో డయాలసిస్ ఏర్పాటులో, ఐసీయూ నిర్మాణం తదితర వాటిలో సహకరించామన్నారు. సింహపురి వైద్య సేవా సమితి ట్రస్ట్ వైస్ చైర్మన్ బాలు సుబ్బారావు మాట్లాడుతూ సామాన్య, పేద తరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో దూరప్రాంతాలకు అంబులెన్స్‌లో రోగులను చేర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహావీర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మిశ్రమల్ జైన్, చంపాలాల్ జైన్, పర్సమానల్ జైన్, దిలీప్‌జైన్, సింహపురి వైద్యసేవా సమితి కోశాధికారి సుధాకర్, రామదండు, వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, హాస్పిటల్ జీఎం గురుప్రసాద్ పాల్గొన్నారు.

30 నుంచి వీఆర్ హైస్కూల్లో తరగతుల ప్రారంభం

నెల్లూరు(టౌన్): వీఆర్ హైస్కూల్లో ఈనెల 30వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం ఆయన వీఆర్ హైస్కూల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా స్కూల్‌ను పునః ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కమిషనర్ నందన్, మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఆనందం, ఆరోగ్యం



కోర్టు ఆవరణలో యోగా చేస్తూ..

నెల్లూరు సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం అనేకచోట్ల కార్యక్రమాలను నిర్వహించారు. యోగాంధ్రలో భాగంగా ప్రజలు యోగాసనాలు వేశారు.

నెల్లూరు రూరల్ మండలంలోని 127 కేంద్రాల్లో 18,043 మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నారని ఎంపీడీఓ వి.శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. పొట్టేపాళెం గ్రామంలోని హైస్కూల్లో యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ 13 వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నట్లు వెల్లడించారు.

- నెల్లూరు(టౌన్): 18వ డివిజన్ పరిధిలోని పీపుల్ పార్క్‌లో జెనెక్స్ విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పార్క్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు చినిగా శ్రీనివాసులురెడ్డి, కార్పొరేటర్ తోటకూర అశోక్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు పెనక శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు యోగాసానాలు వేశారు. మొక్కలు నాటారు. ఆర్గనైజింగ్ కమిటీ జాయింట్ సెక్రటరీ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో యోగాసనాలు వేశారు. విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమం లైవ్‌ను వీక్షించారు. డిప్యూటీ డైరెక్టర్ మాధురి, సెక్రటరీ శ్రీలక్ష్మి, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.
- నెల్లూరు(క్రైమ్): నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో అధికారులు, సిబ్బంది సామూహిక యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ యోగా భారతీయ వారసత్వ సంస్కృతిలో భాగమని, ప్రపంచానికి మనం అందించే విలువైన బహుమతుల్లో ఒకటన్నారు. యోగా అంటే కేవలం ఆసనాలే కాదని శరీరం, మనసు మధ్య సమతుల్యం ఏర్పరుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీలు జి.శ్రీనివాసరావవు, వెంకటరమణ, చంద్రమోహన్, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- నెల్లూరు (లీగల్): జిల్లా కోర్టు ఆవరణలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మొదటి, మూడు, నాలుగు, ఐదు కోర్టుల అదనపు జిల్లా జడ్జీలు గీత, తేజోవతి, కె.శ్రీనివాసరావు, సరస్వతి, పలు కోర్టుల మేజిస్ట్రేట్‌లు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.
- నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు జిల్లా సర్కిల్ జిల్లా ప్రధాన కార్యాలయం విద్యుత్ భవన్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఎస్ఈ విజయన్, ఈఈలు శేషాద్రిబాలచంద్ర, శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, డీఈఈలు శేఖర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.
- నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో, కరెంటాఫీస్ సెంటర్ దగ్గర ఉన్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా దేవదాయ శాఖాధికారి కోవూరు జనార్దనరెడ్డి, ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు ఎ.శ్రీనివాస రెడ్డి, జె.శ్రీనివాసరావు పాల్గొని పర్యవేక్షించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ప్రిన్సిపల్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తొలిరోజు 1 నుంచి 15వేల ర్యాంకు వరకు సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.22వ తేదీ 15వేల నుంచి 32 వేల వరకు 23వ తేదీ 32వేల నుంచి 50వేల వరకు, 24వ తేదీ 50వేల నుంచి 68వేల వరకు, 25వ తేదీ 68 వేల నుంచి 86 వేల వరకు, 26వ తేదీ 86వేల నుంచి 1,04,000 వేల వరకు, 27వ తేదీ 1,04,000 నుంచి 1,20,000 వరకు, 28వ తేదీ చివరి రోజు 1,20,000 నుంచి చివరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఓసీ, బీసీలు రూ.700, ఎస్సీ,ఎస్టీలు రూ.250 ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, ఆటో మొబైల్ ఇంజనీరింగ్, తదితర బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్

- వ్యక్తికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రుడు

సంగం: ట్రాక్టర్‌ను వెనుకగా ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని కొరిమెర్ల వద్ద శనివారం జరిగింది. వివరాలు.. కొరిమెర్ల గ్రామానికి చెందిన రైతులు ట్రాక్టర్‌లో సంగం వచ్చి పనిముట్లు తీసుకుని తిరిగి వెళ్తున్నారు. కలిగిరి రోడ్డు నుంచి కొరిమెర్ల గ్రామంలోకి వెళ్లేందుకు ఎడమవైపునకు తిరుగుతున్న క్రమంలో వెనుకగా వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడు గమనించక ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఆత్మకూరుకు తరలించారు. యువకుడి వివరాలు తెలియరాలేదు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.